

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఘనంగా యోగానంద లక్ష్మీ నర్సింహ్మా స్వామి చక్రతీర్థం

**పూడూరు, మే 26, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని రాకంచెర్ల గ్రామంలో వెలసిన శ్రీ తిరుమలనాథ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం శ్రీ యోగానంద లక్ష్మీ నర్సింహ్మా స్వామి వారికి ఛక్రతీర్థం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కమ్లీబాయి పెంటయ్య, ఆలయ కమిటీ చైర్మన్ జాజుల నర్సింహ్మా కమిటీ సభ్యులతో పాటు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. పలు గ్రామాలకు చెందిన భజన మండలిలు పాల్గొని శ్రీ రాకంచెర్ల వెంకట దాసులవారి సంకీర్తనలను ఆలాపించారు.

ఈ సందర్భంగా ఆలయం ఆవరణతో పాటు గ్రామం అంతా శ్రీ లక్ష్మీనర్సింహ్మా స్వామియే నమ: నామ స్మరణతో మార్మోగింది. సందర్భంగా ఆలయ పూజారులు తిరుమల నాథస్వామి వారి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## పూర్వ విద్యార్థుల ఆపూర్వ కలయిక



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

**షాబాద్, మే 26, ప్రభాతవార్త :** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని అన్‌మోల్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. 1987-88 సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు ఒకే వేదిక పంచుకుని సంతోషంగా గడిపారు. అప్పుడు తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మా నించి వారి ఆశీస్సులు పొందారు. ఒక సందర్భంలో కలిసిన వాళ్లు కొంతమంది ఉంటే మరి కొంతమంది విద్య, ఉపాధి, వివాహం ఇతర కారణలతో ఎక్కడెక్కడికో వెళ్లి స్థిరపడిన వారంతా కలుసు కోవడం, సాధక బాధకాలు తెలుసుకోవడంతో పాటు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఉన్నారు.



కన్హశాంతి వనంలో మధ్యప్రదేశ్ సిఎంను కలిసిన నందిగామ బిజెపి నాయకులు

## మధ్యప్రదేశ్ సిఎంను కలిసిన నందిగామ కమలనాథులు

**నందిగామ, మే 26, ప్రభాతవార్త** నందిగామ మండలం చేగూరు శివారులో ఉన్న కన్హశాతి వనం ధ్యాన మందిరానికి సతీసమేతంగా వచ్చిన మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్‌ను బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లె అశోక్‌గౌడ్ నందిగామ మండలం గిరిజన మోర్చా అధ్యక్షుడు హేమంత్ నాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ అభిమాని నేత కన్హశాంతి వనానికి చేరుకోగానే పూల బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల అధ్యక్షుడు చెన్నయ్య కొత్తూరు మండల అధ్యక్షుడు మంగలి రమేష్ ప్రశాంత్ గౌడ్ బిజెవైఎం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి బూత్ అధ్యక్షుడు నవీన్ చారి తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న అక్రమ కట్టడాల కూల్చివేతలు

**-అక్రమ నిర్మాణదారుల్లో ఆందోళన**



చౌదరిగూడలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న పంచాయతీ సిబ్బంది

**ఘట్‌కేసర్, మే 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చీవేతలు కొనసాగుతునా్నయి. హెచ్‌ఎండిఏ, పంచాయతీల నుంచి జిప్లస్ టు భవనానికి అనుమతి పొంది అదనంగా మరొక అంతస్తు, పెంట్‌హౌస్‌లు నిర్మిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో జిల్లా స్థాయి అధికారులు చర్యలకు పూనుకున్నారు. శచౌదరిగూడలో మేడ్చల్ డిఎల్‌పిఓ సాంబిరెడ్డి, ఘట్‌కేసర్ ఎంపిఓ రవికుమార్‌ల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి శశికుమార్ గత రెండు రోజులుగా అనుమతి నిర్మాణాలను గుర్తించి సిబ్బందితో వెళ్లి కూల్చీ వేయిస్తున్నారు. సాయిసు రక్షకాలనీ, వెంకటాద్రిటౌన్‌షిప్, ఓయూకాలనీ, వైష్ణవినగర్, డాక్టర్స్ కాలనీల్లో అక్రమ నిర్మాణాలను కూల్చీవేయించారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామకార్యదర్శి శశికుమార్ హెచ్చరించారు.

## భారత రాజ్యాంగస్ఫూర్తిని చాటాలి: రాహుల్



అంబేద్కర్‌కు నివాళులు అర్పించి ప్రతిజ్ఞ చేస్తున్న రాహుల్‌యాదవ్, శివాజీనాయక్, అరుణ్‌కుమార్

**ఘట్‌కేసర్, మే 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధబారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 163వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌యుఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మామిండ్ల రాహుల్‌యాదవ్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం. అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాహుల్‌యాదవ్ పాల్గొని మాట్లాడుతూ అంబేద్కర్ ఆధునిక భారతదేశ పితామహుడన్నారు. ఈనెల 23న 2586వ బుద్ధబుద్ధపూర్ణిమ సందర్భంగా బుద్ధ జయంతిని నిర్వహించి పూలదండ వేసి పూజ చేశారు. భారత రాజ్యాంగ పీఠికపై అందరూ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మేకల దాసు, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి నానావత్ శివాజినాయక్, నాయకులు నర్సింగ్‌రావు, అశోక్‌గౌడ్, ఇరిటం శ్రీనివాస్, ప్రసాద్‌నాయక్, అనిల్‌కుమార్, కళ్యాణశ్రీనివాస్, వెంకటేశ్వరారావు, ఆనంద్, విష్ణువర్ధన్, భరత్‌కుమార్, సచిన్, ప్రవీణ్, సాయికిరణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఏఇ

**శామీర్‌పేట, మే 26, ప్రభాతవార్త** విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మత్తు పనుల కారణంగ సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరా యం కల్గుతుందని శామీర్‌పేట విద్యుత్ సెక్షన్ ఏఇ రమేశ్ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. శామీర్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగ సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నల్సార్, ఎన్టీఆర్, ఓ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగ శామీర్‌పేట లోని పెద్దమ్మ కాలనీ, సెలబ్రిటీ హోమ్స్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అదే విధంగ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తూంకుంట ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్నందున, అదే విధంగ శామీర్‌పేట గ్రామానికి కూడ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఇ రమేశ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈవిషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# గాలివాన బీభత్సం



నాగారంలో ప్రధాన రోడ్డుపై నేలకొరిగిన విద్యుత్ స్తంభం

## నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు తడిసి ముద్దయిన ధాన్యం అంధకారంలో ధారూరు మండలం

**ధారూరు,మే 26, ప్రభాతవార్త:** ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపగా, తానేమి తక్కువ కాదన్నట్టుగా వరణుడు తన ప్రతాపాన్ని చూపాడు. ఇద్దరి ప్రతాపానికి జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ధారూరు మండలంలో వింత వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భానుడు ప్రతాపంతో తీవ్ర ఎండల కారణంగా ఒక్కటే ఉక్కపోత నెలకొంది. అంతలోనే ఉన్నట్టుండి ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వాన కురిసింది. గాలి వాన కారణంగా నాగారం, పీసీఎం తాండ, కుమ్మరిపల్లి తాండ, మోమిన్‌కలాన్, మోమిన్‌ఖుర్దు, మైలారం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి. ప్రధాన రోడ్డు మార్గంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరగడంతో రాకపోకలు సైతం స్థంభించాయి. దాదాపు అర గంట పాటు గాలి వాన భీభత్సం కొనసాగింది. ఇండ్లలోంచి ప్రజలు బయటికి రావడానికి సైతం జంకే పరిస్థితి నెలకొంది. రైతుల పరిస్థితి వర్ణణానీతం. పండించిన వరి ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నంలో గాలివానను సైతం లెక్క చేయకుండా వరి ధాన్యం బస్తాలపై టార్పాలిన్ కవర్లు కప్పే పనిలో నిమగ్నమయ్యారు. ఉరుములు ఉరిమినా..మెరుపులు మెరిసినా రైతులు మాత్రం వారి ప్రాణాలు లెక్క చేయకుండా ధాన్యం కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో గాలి వాన భీభత్సం ఉండగా, మిగతా గ్రామాల్లో సాదారణ వాతావరణ పరిస్థితులు నెలకొనడంపై చర్చనీయాంశమైంది. ఏదిఏమైన మండలంలో వింత వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాలి వాన కురిసన గ్రామాల్లో వర్ష భీభత్సం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల్లో అంధకారం నెలకొంది. సంబంధిత అధికారులు త్వరితగిన స్పంధిస్తే తప్ప గ్రామాల్లో వెలుగు కని పించని పరిస్థితి ఆయా గ్రామాల్లో నెలకొంది. అధికారులు ఏ విధంగా స్పంధిస్తారో వేచి చూడాల్సిందేనని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు.



మోమిన్‌కలాన్ గ్రామంలో నేలకొరిగిన చెట్లు



వరి ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నంలో రైతులు



మైలారంలో ఇంటి పైకప్పురేకులు లేచిపోయిన దృశ్యం

# అక్రమ నిర్మాణాలపై అధికారులు గప్‌చుప్

## హిమాయత్‌నగర్

**రెవెన్యూలో ఆగని అక్రమ నిర్మాణాలు**

**కథనాలు వస్తున్న స్పందించని అధికారులు**

**డిఎల్పీవో దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం**





**మొయినాబాద్, మే 26, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలో జంట జలాశయాలు తాగునీరు కలుషితం కాకుండా ట్రిబుల్ వన్‌జీవో అమలులో ఉంది. గ్రామకంఠ భూముల్లో ఇష్టానుసారంగా వెంచర్లు చేసి అక్రమంగా పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టరాదని మొయినాబాద్ మండలం లోని అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణం నిర్మించకూ డదని ప్రభుత్వం 111 జీవో ఏర్పాటు చేసంది కానీ మండలంలో ట్రిబుల్ వన్ జీవోకు పూర్తిగా విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కోకొల్లలుగా వెలుస్తున్నాయి. ముఖ్యంగా మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామ రెవెన్యూలో పద్మావతి వెంచర్‌ఫేస్ వన్ ఫేస్‌టు వందలకొద్ది అక్రమంగా నిర్మాణాలు చేపడుతుంటే సం బంధిత పంచాయతీ అధికారుల మాత్రం నిర్మకు నీరెత్తిన్నట్లు మౌనం వహిస్తున్నారు. హిమాయత్‌నగర్ గ్రామ కార్యదర్శి అసలు ఉన్నారా లేరా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హిమాయత్‌నగర్ రెవెన్యూలో విజిఐ ఈటీ కళాశాల పక్కన కొన్ని వేల గజాలలో కొన్ని కోట్ల రూపాయలతో కొంతమంది అక్రమనిర్మా ణాలు చేప డుతుంటే అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. ప్రభుత్వంలో ఉన్న లీటర్ల పేర్లు చెప్పు కుంటూ స్థానిక అధికారులను కూడా బెదిరిస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇది నిజం కాకపోతే అధికారులు వాటిపై ఎందు కు చర్యలు తీసుకోవాలని స్థానికులు వాపోతున్నారు. చట్టం ప్రకారం అందరు సమానువలే ప్రతి వ్యక్తికి ప్రభుత్వంలో ఉన్న అధికారులకుగానీ ప్రభుత్వ పెద్దలకుగానీ ఒకేరీతిగా వ్యవహరిం చాల్సి న ఉంటుంది కానీ ఇష్టానుసారంగా నిర్మాణాలు చెప్పటి ప్రభుత్వంలో మిని స్టర్ల తెలుసు అంటూ బెదిరింపులకు దిగడం తగదని స్థానికులు పేర్కొంటున్నారు. హిమాయత్‌నగర్ రెవెన్యూవల్ల నిత్యం పర్యావరణానికి తూట్లు పొడుస్తూ నిత్యం దుమ్ము ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలు ఎవరు చేయకూడదు ఎవరైనా రూల్స్‌కు విదుద్దంగా నిర్మాణాలు చేపడితే వెంటనే అక్కడికి వెళ్లి ఆపివాటి నికూల్చి వేసే అధికారం అధికారులకు ఉన్న ఎందుకు మౌనం వహిస్తు న్నారని స్థానికుల ఆవేదన వ్యక్తం చేన్నారు. 111 జివోలో ఉన్నటువంటి నిబంధనలను ఉల్లఘించి నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందింగా స్థానికులు కోరుతున్నారు.

# చౌదరిగూడలో డ్రైనేజీ సమస్య

## అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు అవస్థలు



వెంకటాద్రిటౌన్‌షిప్‌లో సిసి రోడ్డుపై డ్రైనేజీ నీరు

**ఘట్‌కేసర్, మే 26, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధికి ఆటంకం కల్గుతున్నది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ పరిధిలో పారిశుద్యం అస్తవ్యస్థంగా మారింది. పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ప్రజాప్రతినిధులు లేక ప్రజలు సమస్యలు పట్టించుకునేవారు కరువయ్యారనే విమర్శలు వస్తున్నాయి. సర్పంచ్‌ల స్థానంలో ప్రభుత్వం జిల్లా స్థాయి అధికారులను గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించింది. ప్రత్యేకాధికారులు వారానికి ఒక సారి వచ్చి వెళ్తూ ఇళ్ల అనుమతుల ధరఖాస్తులపై సంతకాలు చేయడానికే పరిమితం అవుతున్నారని విమర్శిస్తున్నారు. గ్రామాల సందర్శన చేయకుండా సమస యలను తెలుసుకోకుండా జిల్లా కలెక్టరేట్, ఇతర జిల్లా శాఖల కార్యాలయల్లో ఉంటూ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. మంచినీటి, డ్రైనేజీ, వీధిదీపాల మరమ్మత్తులు చేయాలని ప్రజలు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే నిధులు లేవని అధికారులు నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని ప్రత్యేకాధికారి అనుమతి లేకుండా పనులు చేయలేమని సిబ్బంది అంటున్నారని స్థానికులు వాపోతున్నారు. మేడ్చల్ జిల్లాలోనే పెద్ద గ్రామపంచాయతీ చౌదరిగూడ పరిధిలో దాదాపు 65 కాలనీలు ఉండగా ప్రధానంగా డ్రైనేజీ, నీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చౌదరిగూడ అనుబంధ గ్రామం మక్తాలోని మహంకాళీ అమ్మవారి దేవాలయం వద్ద, పోచమ్మ దేవాలయం వద్ద డ్రైనేజీ మురికి నీరు ప్రధాన రోడ్డుపైనే పారుతున్నది. దీంతో గుంతలు ఏర్పడగా దుర్వాసన వస్తుందని అంటురోగాలు వ్యాపించే ఆస్కారముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వెంట అపరిశుభ్రమైన వాతావరణ ఏర్పడిందని ఈగలు, దోమల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వెంకటాద్రిటౌన్‌షిప్ పేజ్ 1 రోడ్డు నెంబర్ 2లో మ్యాన్‌హోల్ నుంచి డ్రైనేజీ మురికి పైకి వచ్చి సిమెంట్‌రోడ్డుపై పారుతుందని వాహనదారులు, పాదచారులకు అసౌకర్యంగా మారిందని స్థానికులు పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్యపై పలుసార్లు గ్రామపంచాయతీలో తెలియజేసినా ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఇటీవలే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. కాగా ఏలాంటి పనులు చేయడానికైనా ఎంబి రికార్డు చేయాలని ప్రత్యేకాధికారి నిబంధన విధించడంతో సిబ్బందికి ఇబ్బందులు ఎదురురవుతున్నాయి. చౌదరిగూడకు డీపీఓ ప్రత్యేకాధికారిగా ఉన్నా ఆయన ప్రజాసమస్యలను పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఇకనైనా డ్రైనేజీ సమస్యలను తీర్చేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

### ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**యాచారం, మే 26,ప్రభాతవార్త:** ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గున్‌గల్‌గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెదమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, వైఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి గజ్జి రామకృష్ణ యాదవ్ బిఎస్‌రెడ్డి ట్రస్ట్ చెర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి అమృత సాగర్ ఎంపిటిసి జ్యోతి ఆరవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటాం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జిల్లెడు చౌదరిగూడ, మే 26,(ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ కార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఓ ప్రైవటు కార్యక్రమంలో పాల్గోన్న ఆయన లచ్చంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చింది కార్యర్తలని అన్నారు. ఇతర పార్టీల నాయకులు తయ పార్టీ నాయకులను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ తల్లి లాంటిదని అందరని క్షమిస్తుందని ఆయన పెర్కోన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువ ఎన్నికల కోడ్ అమలులో ఉందని అందువల్లన కొన్ని పథకాలు అమలు కాలేదని అన్నారు. కోడ్ ముగిసిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్దంగ ఉందని అన్నారు. బీఆర్, బీజెపి పార్టీల వలే కల్లబొల్లి మాటలు కాంగ్రెస్ నాయకత్వానికి లేవని తెలిపారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న పార్టీలకు ప్రజలు ఎందుకు గుర్తుకు రాలెదని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చి కొన్ని నెలలలోనే హామీలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన పెర్కోన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిల సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఎంపిటిసి రజిత వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, నాయకులు అంజనేయులు, రమకృష్ణారెడ్డి, రాములు తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా స్వామి రథోత్సవం.. సాముహిక సత్యనారాయణస్వామి వ్రతం



వెంకటాపూర్‌లో శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్, మే 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి గరుడ సేవ, శేషవాహన సేవ భక్తుల గోవిందనామ స్మరణ మధ్య జరిపారు. ఉదయం స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. వెంకటాపూర్, తేనుగూడెం గ్రామాల్లో బాజాభజంత్రీలు, కళాకారుల నృత్యాలు, భక్తుల గోవింద స్మరణతో రథం సాగింది. భక్తులు రథం ముందు నీరు పోస్తూ మంగళహారతులతో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆదివారం సుప్రభాతసేవ, చక్రతీర్థం, మంత్రపుష్పం, ఆలయంలో సాముహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. పలువురు దంపతులు స్వామి వ్రతంలో భక్తి శ్రద్ధలతో పాల్గొని పూజలు చేశారు. దేవాలయంలో గత ఐదు రోజులుగా ఘనంగా జరుగుతున్న బ్రహ్మోత స్వాలు ముగిసాయి. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉదారి వేణుగోపాల్, ఈఓ ఎల్. బాగ్యలక్ష్మి, ఎంపిటిసి నిరుడి రామారావు, మాజీ సర్పంచులు దేశం బాల్‌రాజ్‌గౌడ్, నిరుడి గీత శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి బుర్ర కల్పన వెంకటేశ్, ట్రస్ట్‌బోర్డు డైరక్టర్లు కందుల నవీన్, నిరుడి శంకర్, నిరుడి లింగం, అంకన్నగారి రామకృష్ణారెడ్డి, కట్ట శేఖర్, గుర్రం కళావతి, అర్చకులు వినయ్‌శర్మ, మాజీచైర్మన్ అశోక్, మాజీ ఉపసర్పంచులు కట్ట సత్యనారా యణగౌడ్, బాల్‌రాజ్, నాయకులు సత్తయ్య, జంగయ్య, కుమార్, హరిబాబు, మహంకాళీ, మాజీ వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం, జాతర

**శామీర్‌పేట, మే 26, ప్రభాతవార్త** లక్ష్మాపూర్ గ్రామ సమీపంలోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం, జాతర మహోత్సవాలు ఆలయంలో ఈ నెల 27,28,29 తేదీలలో జరుగనున్నట్లు లక్ష్మాపూర్ గౌడ సంఘం వారు పేర్కొన్నారు. మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో 27న సోమవారం ఉదయం 10గంటలకు పుట్ట బంగారం తెచ్చుట, మధ్యాహ్నం 12గంటలకు లంధకు వెళ్లటం, సాయంత్రం గంగకు వెళ్లటం జరుగుతుందన్నారు. 28న మంగళవారం ఉదయం జాతరలో భాగంగ గణపతి నవగ్రహ పూజ, హోమం, ఉదయం 11గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం జరుగుతుందని, మధ్యాహ్నం 1గంటకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం 5గంటలకు బోనాలు, ఊరేగింపు, ఘటం తీసే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 29న బుధవారం ఉదయం 8గంటలకు వనభోజనం కార్యక్రమాలు ఉంటాయన్నారు.



మల్లీశ్వరి గజల్స్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## బహుముఖ ప్రజ్ఞాశీలతకు నిదర్శనం మల్లీశ్వరి గజల్స్ : ఆవిష్కర్తలు

**రవీంద్రభారతి, మే 26 ప్రభాతవార్త :** సుప్రసిద్ధ గజల్స్ కవనేయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన గజల్స్‌లో అద్భుత శబ్ద సౌందర్యం, పదప్రయోగం, భావుకత, కవితాత్మకత, పదచిత్రాలు, గజలియత్, రసావిష్కరణ తదితర ఎన్నో అంశాలు ఆమె బహుముఖ ప్రజ్ఞాశీలతకు నిదర్శనమని ఆదివారం రాత్రి రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఆమె రచించిన 3 గజల్స్ పుస్తకాలను ఆవిష్కరించిన ప్రముఖులు మాట్లాడుతూ ప్రశంసించారు. సుప్రసిద్ధకవి, విమర్శకుడు, బహుగ్రంథకర్త కళారత్న డా. బిక్కి కృష్ణ సభాధ్యక్షతన భారతదేశ గజల్స్ చరిత్రలో నూతనాధ్యాయానికి నాందిపలికి ప్రపంచ రికార్డులను పొంది, గజల్ క్వీన్, గజల్ వాగ్గేయకారిణి అనిపించుకొన్న రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి ఇప్పటి వరకు రచించిన 10 గజల్స్ సంపుటాల్లోని 8, 9, 10 వలపు; కలికి; నే అనే తీయని తెలుగు గజల్స్‌ను విచ్చేసిన ప్రముఖులైన అతిథులు డా. వెనిగళ్ళ రాంబాబు, సూరారం శంకర్, మురళీధర్‌లు ఆత్మీయ అతిథులు వల్లూరి రాఘవరావు, లక్ష్మీభవాని, శ్రీదేవి జక్కా, రాధాకుసుమ తదితరులు పాల్గొని ఆవిష్కరించి మల్లీశ్వరిని ఎంతగానో అభినందించారు. ప్రముఖ గాయకులు ఎంఆర్‌కె. ప్రభాకర్, సందన్‌రాజు, లక్ష్మీభవాని, శాంతినిర్మల, భవానిరాజులు వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన గజల్లను ఆలపించి ఆహుతులకు వీనులవిందు చేశారు. చివరిగా రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షురాలు, కవయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి తన స్పందనను తెలిపి గాయకులను ఘనంగా సన్మానించారు.

## ఏకగ్రీవంగా తిరుమలహిల్స్ కాలనీ కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గంను ఎంపిక చేస్తున్న కాలనీ ప్రతినిధులు

**నార్సింగి, మే 26 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా పుస్తె అవినాష్, ఉపాధ్యక్షుడిగా ఎం.భరత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రావ్, కోశాధికారిగా నారాయణ, సంయుక్త కార్యదర్శిగా రమణారెడ్డి, సభ్యులుగా అనిరుద్, సౌజన్యలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు అవినాష్ మాట్లాడుతూ నాపై కాలనీ ప్రతినిధులు ఉంచిన నమ్మకంను మరింత పెంచుకునేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు. కాలనీ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపి త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తానని వివరించారు. కాలనీలో ఉన్న 1500.గజాల పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయిస్తానని, కాలనీలో మంచినీరు లోప్రెషర్‌తో వస్తుందని, ఈ సమస్యను జల మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామన్నారు. కాలనీ అభ్యున్నతికి సీనియర్ సిటిజెన్స్, కాలనీ పెద్దలు, కమిటీ సభ్యులందరం కలిసి సమిష్టి నిర్ణయాలు తీసుకుంటామని అవినాష్ వివరించారు. నూతన కమిటీ సభ్యులకు కాలనీ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆధునిక యాంత్రిక జీవనంలో 'వివాహ పరిచయ వేదిక'లకు పెరిగిన ప్రాధాన్యం

**-భూగర్భ గనుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ సుశీల్‌కుమార్**

**హైదరాబాద్, మే 26 ప్రభాతవార్త:** కుటుంబ వ్యవస్థ కుచించుకపోతూ ఉమ్మడి కుటుంబాలకు దురమవుతున్న నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో 'వివాహ పరిచయ వేదిక'లకు ప్రాధాన్యత మరింత పెరిగిందని భూగర్భ గనుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ బిఆర్‌వి.సుశీల్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఆదివారం బాగ్ అంబర్‌పేటలో బ్రాహ్మణ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఏర్పాటు చేసిన 'బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక'లో సుశీల్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ వివాహ వేదికలు వరంగా మారాయని, నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఈ వేదికలు విస్తరించాయన్నారు. నేడు వివాహ పరిచయ వేదికల ద్వారానే యువతీ యువకులకు వివాహాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ వేదికలను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.నీలకంఠం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వింజమూరి సుధాకర్, గౌరవ సలహాదారు, ప్రముఖ న్యాయవాది శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు యమునా పాఠక్, సీతారామయ్య, గోపాలరావు, రఘునందన్, రవికిరణ్, రమణప్రసాద్, పీవీ.రామచందరరావు,

## విశ్వకర్మ లెజెండరీ అవార్డులు ప్రదానం



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త:** సమాజహితం కోసం చేసే వారిని గుర్తించి పురస్కారాలను అందించడం మంచి సంప్రదాయమని నందికొండ జగద్గురు కాళహస్త్యాచార్యా, మహాసంస్థానము జ్ఞానపీఠం పీఠాధీశ్వరులు జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామి అన్నారు. ఆదివారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 8వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబర్చిన వారికి 'విశ్వకర్మ లెజెండరీ అవార్డులు' ప్రదానోత్సవ కార్యక్రమం సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథుల పుష్పగిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాంతేంద్ర స్వామి హాజరై ఈ పురస్కారాలను అందించి గౌరవించి ప్రసంగించారు. ఇలాంటి అవార్డులు అందించడం వల్ల వారిలో మరింత ప్రోత్సాహాన్ని నింపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, చర్లపల్లి జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ దార్ల కాళిదాస్, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి నామోజు బాలాచారి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ డాక్టర్ బి.నీలిమా కృష్ణమూర్తి, సమాచార పౌరసంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వెంకటరమణ, నెదనూరి దిలీప్ ఆచారి, తాటికొండ రంగబాబు, దరువు అంజన్న, అన్నబీమోజు జితేంద్రాచారి, గణేష్‌బాబు, విద్యాసాగర్, జితేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి ఆర్థిక సాయం

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి వైద్యానికి యువజన కాంగ్రెస్ నాయకుడు అండగా నిలిచి ఆర్థిక సాయం అందించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్‌కు చెందిన మనోహర్ అనే వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో ఉన్న విషయాన్ని తెలుసుకున్న అల్మాస్‌గూడకు చెందిన మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆయనను పరామర్శించి రూ.10 వేల సాయం అందించారు. అదే విధంగా ఆయన చికిత్సకు సహాయం అందజేస్తానని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కొప్పూరి రాకేష్, వినోద్ నాయక్, మధు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు 'నామం'




- మహానగరంలో మాయగాళ్లు
- పొంచి ఉన్న ప్రమాదంలా నకిలీ ఉద్యోగాలు
- నిరుద్యోగుల పాలిట ఉచ్చు
- ధనార్జనే ధ్యేయంగా వరుస మోసాలు
- జాగ్రత్తలు చెబుతున్న పోలీసులు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** నిరుద్యోగుల బలహీనతలను ఆసరాగా చేసుకుని వరుస ఉద్యోగ మోసాలతో చెలరేగిపోతున్నారు కేటు గాళ్ళు. మొన్న గ్రూప్-1 ఉద్యోగాల పేరుతో నగరానికి చెందిన నలుగురు సభ్యుల ముఠా పలువురికి టోకరావేయగా, నిన్నటికి నిన్న డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాల ఖాళీల పేరుతో నగరానికి చెందిన ఒక నకిలీ పోలీసు మోసాలకు పాల్పడ్డాడు. మరో కేసులో ఇంటర్వ్యూకి వచ్చిన నిరుద్యోగ యువతిపై అత్యాచారం చేయబోయిన ఘటన దుమారం రేపగా, తాజాగా జీహెచ్ఎంసీలో ఉద్యోగాలిప్పిస్తామని 30 మందిని ఒక వ్యక్తి మోసం చేసి డబ్బుతో ఉడాయించాడు. మరో కేసులో ఉద్యోగాల పేరుతో టోకరావేసిన కేటుగాడి నుంచి తమ డబ్బు వసూలు చేసు కోడానికి అతడి భార్యను కిడ్నాప్‌చేశారు బాధితులు. ఇవేకాక, ఒరాకిల్ వంటి సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇచ్చి పెద్దసంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎస్ఆర్ నగర్ కళ్యాణమండపం వద్ద కొన్ని నకిలీ ఇన్‌స్టిట్యూట్‌ల నిర్వాకం గుట్టుచప్పుడు కాకుండా నడుస్తుండడంతో పోలీసులు నిఘావేశారు. వివిధ బ్యాంక్ ఉద్యోగాల గ్యారంటీ పేరుతో బేగంపేటలో నకిలీ శిక్షణా శిబిరాలు వెలవడమే కాక, అమేజాన్ వంటి మల్టీ నేషనల్ కంపెనీల్లో ప్రైవేట్ ఉద్యోగాల పేరుతో ఇంటర్వ్యూలు చేసి డబ్బు వసూలు చేసే నకిలీ కార్యాలయాలు కూడా పలు ప్రాంతాల్లో వెలిశాయి. మరోపక్క నిరుద్యోగులను విదేశాలకు విక్రయించే ఏజెంట్లు మాటువేశారు. మోసంచేయడమే ఉద్యోగంగా మార్చి ఎందరో నిరుద్యోగులను ట్రాప్ చేసి విదేశాలకు అక్రమ రవాణాగా తరలిస్తున్న ఏజెంట్లను పోలీసులు అరెస్ట్ చేయడంతో చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న సామాన్యులు ప్రముఖ సంస్థల నుంచి ఉద్యోగాల ప్రకటనలు చూసినా దరఖాస్తు చేసుకోవడానికి జంకుతున్నారు.

**విద్యార్థుల వివరాలతో ఫైనాన్స్ కంపెనీకి నామం:**

ఇటీవల శిక్షణ ఇచ్చి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నగరానికి చెందిన ఒక ప్రైవేటు సంస్థ బోర్డు తిప్పేయడమేకాక, విద్యార్థుల పేరుతో ఫైనాన్స్ కంపెనీల్లో రుణాలు తీసుకుని పరారైన విషయం తాజాగా చోటుచేసుకుంది. కుంచం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ పేరుతో నిర్వహకులు ఒక సంస్థను నెలకొల్పారు. వారి ప్రకటనలో సాఫ్ట్‌వేర్ శిక్షణ వివరాలకు ఆకర్షింపబడిన విద్యార్థులు పెద్ద ఎత్తున అందులో చేరారు. విద్యార్థులు ఒక్కొక్కరి నుంచీ భారీగా రిజిస్ట్రేషన్ ఋసుము వసూలు చేసిన నిర్వహకులు, వాదందరి వివరాలూ తమ వద్ద ఉండడంతో వారందరిలోనూ ఒక్కొక్కరి పేరుతో పలు ఫైనాన్స్ కంపెనీల్లో సుమారు రూ.4లక్షలు రుణం తీసుకున్నారు.

ఈ సంస్థ బోర్డు తిప్పేయడం తో ఆయా ఫైనాన్స్ సంస్థలు తమ రుణం కట్టాలని అమాయకులైన విద్యార్థులకు ఫోన్లు చేసి ఒత్తిడి తెస్తున్నాయి. దాంతో మోసపోయిన విద్యార్థులందరూ తెలంగాణ మహిళా సంక్షేమ మంత్రి దాసరి అనసూయ సహాయంతో నగర పోలీసు శాఖకు వరుస ఫిర్యాదులుచేశారు. ఈమేరకు కేసులు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అంతే కాకుండా విద్యార్థులకు శిక్షణ ఇచ్చే పలు ప్రైవేటు సంస్థలపై నిఘా పెట్టారు.

**డేటా ఎంట్రీ అయితే నమ్మొద్దు:**

ఉద్యోగాల పేరుతో జరిగే మోసపూరితమైన ప్రకటనలను కొత్తగా చదువు పూర్తి చేసుకుని బయట కొచ్చిన విద్యార్థులు పలు విధాలుగా గుర్తించవచ్చని పోలీసు శాఖ తెలిపింది. కాలేజి చదువు ముగించి బయటకు వచ్చే విద్యార్థులు చాలా మందికి ఉద్యోగ వేటలో జరిగే అనర్థాలు, మోసాలు తెలియని కారణంగా విధ విధాలుగా నష్టపోతున్నారని, వీరికి కెరీర్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కాలేజి యాజమాన్యంలో ప్రతీ ఉపాధ్యాయులకీ ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు విదేశీ ఉద్యోగాపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. కేవలం చదువుకున్న చదువుకు, లేదా అర్హత సంపాదించిన కోర్సుకు చెందిన ప్రొఫెషనల్ ఉద్యోగాలకు మాత్రమే విదేశాల్లో దరఖాస్తు చేసుకోమని, డేటా ఎంట్రీ ఆపరేటర్ పేరుతో విదేశాల్లో ఉద్యోగావకాశాలు ఉంటే వాటిని నమ్మవద్దని పోలీసులు చెబుతున్నారు. ప్రొఫెషనల్ ఉద్యోగాలకైతే పేరున్న సంస్థల నుంచి నిర్దిష్టమైన వివరాలతో కంపెనీ ప్రొఫైల్, జాబ్ ప్రొఫైల్లు ఉంటాయని, ఉద్యోగాల సెలెక్షన్‌లో భాగంగా అభ్యర్థిని ఆ సబ్జెక్టుకు చెందిన పరిజ్ఞానంతో కూడిన ప్రశ్నలను టెలిఫోనిక్ ఇంటర్వ్యూలలోనూ, ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూలలోనూ అడుగుతారని తద్వారా అవి మోసపూరితమైన ప్రకటనలు కావని నిరుద్యోగులు గుర్తించవచ్చన్నారు. అంతే కాకుండా ఉద్యోగం ఇచ్చే వారు తమ వద్ద చేరి పని చేసిన అభ్యర్థులకు జీతాలిస్తారు గానీ, ఐడీ కార్డుకు కొంత రుసుము, ఆఫర్ లెటర్‌కు మరికొంత రుసుము, ఇంటర్వ్యూ చేసినందుకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ రుసుము తీసుకోరని తెలిపారు. అలా తీసుకుంటున్నట్లైతే అవి ఫ్రాడ్ చేసే కేటుగాళ్ళ పనిగా గుర్తించాలని పేర్కొన్నారు. కొన్ని కన్సల్టెన్సీలు ముందస్తు రుసుము తీసుకుంటాయనీ, వాటికీ నకిలీ సంస్థలకూ తేడా గమనించాలని తెలిపారు. ముఖ్యంగా హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్‌లు నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేస్తారని, వారు మాట్లాడే ఇంగ్లీష్‌ను బట్టి వారు అసలైన వారా లేక మోసగాళ్ళా అనేది తెలిపోతుందని చెప్పారు. మోసగాళ్ళలో సరిగ్గా కమ్యూనికేషన్ స్కిల్స్ లేని వారు ఉంటారని, ఏమాత్రం సందేహం ఉన్నా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు 1 9 3 0 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవల్సిందిగా పోలీసులు తెలియజేశారు.

## మోడీతోనే దేశం అభివృద్ధి : మన్నె ఆంజనేయులు

**రాయపోల్ మే26 ప్రభాతవార్త** ప్రధాని నరేంద్రమోడీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బిజెపి మండల నాయకులు మన్నె ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా అదివారం రాయపోల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నిక ల్లో ప్రధాని నరేంద్ర మోడీ ముచ్చటగా మూడవసారి కేంద్రంలో అధికారం లోకి రావడం ఖాయమని ఆయన అన్నారు. దేశం అభివృద్ధి చెందటాంటే ప్రధాని నరేంద్ర మోడీ సాధ్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకా లతో దేశ ప్రజలు మరోసారి ప్రధానిగా నరేంద్ర మోడీకే భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారని ఆయన అన్నారు. ఉగ్రవాదం, దేశ రక్షణ, అంతర్గత భద్రతకు బిజెపి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మెదక్ ఎంపీగామాధ వనేని రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలువబోతున్నారని ఆయన అన్నారు

## గౌరవెల్లిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**అక్కన్నపేట, మే26, ప్రభాతవార్త** మండలంలోని గౌరవెల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యా బుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ చిన్న నాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, మోహన్‌రావు, లక్ష్మీనారాయణ, నారాయణరెడ్డి, రాజేశం, లక్ష్మారెడ్డి, కనుకయ్య, శంకర్, వెంకట్‌రెడ్డి, శకుంతల, శ్రీనివాస్, లింగారెడ్డి, మోహన్, శ్రీనివాస్, సంపత్, పరమేష్, విజయ్‌కుమార్‌తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానికేతరుల పాలన వల్లే అభివృద్ధికి నోచుకోని ఎల్లమ్మ దేవాలమం

**బిజెపి కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి**

**హుస్నాబాద్, మే26, ప్రభాతవార్త** దక్షణ భారతదేశంలోనే గొప్పగా జరిగే జాతర శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రోజున ఎల్లమ్మతల్లిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఇంత గొప్ప మహిమ గల దేవాలయం హుస్నాబాద్‌లో ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మహిమ గల గొప్ప ఆమ్మవారి దేవాలయం స్థానికేతరుల పాలన వల్లే అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ సంవత్సరం మే నుండి జూన్ అంటే నెల రోజుల వరకు జరిగే ఈ దేవాలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు లేవడం బాదాకరమైన విషయమన్నారు. రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అంతే కాకుండా దేవాలయానికి తన సహకారం ఎప్పటికీ అందిస్తానని హామీ ఇచ్చారు.

## లలితక్క విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

**హుస్నాబాద్, మే26, ప్రభాతవార్త** బెల్లి లలితక్క విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని హుస్నాబాద్ జాయింట్ యాక్షన్ కమిటి నియోజకవర్గ కో కన్వీనర్ మ్యాకల వీరన్న యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం లలితక్క 25వ వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఉద్యమ వ్యతిరేకులు బెల్లి లిలత్కను 17 ముక్కలుగా నిరికి గోనె సంచిలో కట్టి చెరువుకుంటలో పడేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికురాలిగా పని చేసిన లలితక్క కార్మిక, మహిళా సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించిందని, ఫ్లోరైట్ సమస్యపై ప్రజలను చైతన్యం చేయడంతో పాటు వైశ్య వృత్తిలో ఉన్న మహిళలను ఆనరకం నుండి విడిపించిందన్నారు. తెలంగాణ జనసభ ఆధ్వర్యంలో తెలంగాణ కళాసమితికి కోకన్వీనర్‌గా ఉండి ఉద్యమాలు నిర్వహించిన విషయాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి బాధ్యులు ఇల్లందుల లక్ష్మణ్‌గౌడ్, గొర్ల వీరన్నయాదవ్, నరసింహ, రమేష్, సంపత్, శ్రీనివాస్, దిలీప్ పాల్గొన్నారు.

## డిసిఎంలోని గడ్డికి మంటలు

**చిన్నశంకరంపేట, మే26, ప్రభాతవార్త:** మండల పరిధి మదూరులో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్తుతీగలు తగిలి డీసీఎంలోని గడ్డికి మంటలు వ్యాపించాయి. అంబాజిపేటకు చెందిన నర్సింలు మదురూ రైతుల వద్ద నుండి గడ్డిని సేకరించి తన డీసీఎంలో తరలిస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు గడ్డికి తగిలి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. గమనించిన రైతులు వెంటనే రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు 1లక్ష రూపాయాల నష్టం వాటిలిందని నర్సింలు వాపోయాడు.



జుబ్లీహిల్స్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్‌లో జరిగిన డయాబెటిస్ ఎక్స్‌పో-2024ని ప్రారంభించిన సుప్రీంకోర్టు మాజీ చీఫ్‌జస్టిస్ ఎన్.వి.రమణ

## పాఠశాలల పునః ప్రారంభానికి ముందే

# గురుకులాల్లో బదలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

**గురుకుల జెఎసి సమావేశంలో తీర్మానం**



సమావేశంలో పాల్గొన్న గురుకుల జెఏసిన ప్రతినిధులు

**ఎల్‌బినగర్, మే 26 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్‌లోని టిగారియా సంఘం కార్యాలయంలో ఆదివారం గురుకుల జెఎసి సమావేశం నిర్వహించారు. సమావేశానికి సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ, జనరల్ గురుకులాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. గురుకులాలన్నింటికి కామన్ అడ్మినిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా గురుకుల డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని, ప్రజాభవన్‌లో గురుకుల ఉపాధ్యాయులు ఫిబ్రవరిలో ఆందోళన చేసిన సమయంలో జెఏసికి ఇచ్చిన హామీ మేరకు పాఠశాలలు పునఃప్రారంభం కావడానికి ముందే జిఓ 317 బదిలీలు పూర్తి చేసి ప్రమోషన్స్ ఇవ్వాలని, సాధారణ బదిలీలు పూర్తి చేసిన తర్వాతే నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్స్ ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల డైట్ ఛార్జీలను పాఠశాలలు ప్రారంభించడానికి ముందే పెంచాలని, గురుకుల ఉపాధ్యాయులకు నైట్ స్టేను తొలగించాలని, రాబోయే పిఆర్‌సిలో గురుకుల ఉపాధ్యాయులకు ప్రత్యేక వేతన స్కేలు, స్పెషల్ టీచర్స్‌కు టిజిటికి సమానమైన స్కేలు వర్తింప చేయాలని, అన్ని గురుకులాల్లో వార్డెన్ పోస్టులు భర్తీ చేసి ఉపాధ్యాయులను డిప్యూటీ వార్డెన్ బాధ్యతల నుంచి విముక్తి చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల టైమింగ్స్‌ను గురుకుల డిగ్రీ కళాశాలలకు వర్తింప చేయాలని, అన్ని గురుకులాలకు ఒకే రకమైన స్టాఫ్ ప్యాటర్న్ ఉండేలా ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయాలని, బిసి గురుకుల పాఠశాలల టైమ్‌ను 9 గంటలకు మార్చాలని సమావేశంలో తీర్మానం చేశారు. గురుకులాల సంఖ్యను పెంచినప్పటికీ సరైన సదుపాయాలు కల్పించక పోవడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.మధుసూధన్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.రామకృష్ణయ్య, సంక్షేమ గురుకుల ప్రతినిధులు నర్సింహులు గౌడ్, కె.జనార్ధన్, బి.బిక్షం, గిరిజన గురుకుల ప్రతినిధులు పిఎస్ కమలాకర్, తెలంగాణ గురుకుల ప్రతినిధులు డాక్టర్ అజయ్ కుమార్, పిడిపిటి అసోసియేషన్ ప్రతినిధి ఆర్.లాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ అసోసియేషన్ ప్రతినిధులు ఎ.వేదాంతచారి, బి.కౌముది, జి.రజని, ఎస్‌సి గురుకుల ప్రిన్సిపాల్ సంఘం ప్రతినిధులు ఎస్.దానం, ఎస్.దయాకర్, మైనార్టీ గురుకుల సొసైటీ ప్రతినిధి ఎం.కృష్ణ పాల్గొన్నారు.



గణపతి, సిద్ధి, బుద్ధి విగ్రహాలను అందజేస్తున్న గోపాలకృష్ణ, మహాలక్ష్మి

## లక్ష్మీగణపతి దేవాలయానికి ఉత్సవ మూర్తుల విరాళం

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్‌లోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు గోపాలకృష్ణ, మహాలక్ష్మి దంపతులు గణపతి, సిద్ధి, బుద్ధి ఉత్సవ మూర్తులను ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు విగ్రహాలను ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సుజిత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, వెంకట రమణ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## నందనవనంలో వాహనాల చెకింగ్

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:** రాచకొండ పోలీస్ కమిషనరేట్ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందనవనం వద్ద పోలీసులు వాహనాల చెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో డిఐ గౌరినాయుడు, ఎస్ఐ సుధాకర్, వెంకటరాంరెడ్డిలు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు నెంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు.

## సుధీర్‌కుమార్‌కు ఘన నివాళులు



సుదీర్‌కుమార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త:** యువజన కాంగ్రెస్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పి.సుధీర్‌కుమార్ 22వ జయంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి సుధీర్‌కుమార్ కుమార్తె రమ్యాతేజ, కుమారుడు శశిసుధీర్, అల్లుడు సుకినరెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక నాయకులు రమేష్ గౌడ్, శ్రీనివాస్‌నాయుడు, వినోద్, రంగినేని శ్రీనివాస్ తదితరులు సుదీర్ కుమార్ అభిమానులు పాల్గొన్నారు. అనంతరం నీలోఫర్ హాస్పిటల్, బసవతారకం హాస్పిటల్ వద్ద కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

## మణికొండలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

**నార్సింగి, మే 26 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్వర్ణదేవాలయం వద్ద విఆర్‌ఫర్‌యు సంస్థ ప్రతినిధులు ఆదివారం ప్రయాణికులకు చల్లటి మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు చల్లటి మజ్జిగ పాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విఆర్‌ఫర్‌యు సంస్థ ప్రతినిధులు సాటి వారికి సహాయపడడంలో ఎల్లప్పుడూ ముందుంటున్నారని తెలిపారు. ఉచిత అన్నదానాలు, ఉచిత వైద్య శిబిరాలు, చలివేంద్రాల ద్వారా చల్లటి మంచినీరు, మజ్జిగలను పంపిణీ చేసి సాటి వారికి సహాయపడాలన్న గుణానికి ప్రజలకు అలవాటు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. తీసుకోవడంలో కన్న ఇవ్వడంలోనే, త్యాగంలోనే అనంతమైన సంతృప్తి లభిస్తుంటుందన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇలాంటి మంచి పనులు చేసేందుకు మరింత మంది ముందుకు రావాల్సిన అవసరం ఉందని రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఫర్‌యు సభ్యులు ప్రదీప్‌రావ్, సాంబశివరావ్, రామసుబ్బయ్య, నాగేంద్రరావ్, రంగాచారి, నాగభూషణం, కన్నయ్య, ప్రభావతి, ప్రతినిధులు మంజు అగర్వాల్, లక్ష్మణ్, కాంతారావ్, ఆరిఫ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన తునికి నల్ల పోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, మే 26, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో రెండవ అతి పెద్ద జాతరగా పేరు గాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం అదివారం నాడు భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుండి ఆలయం వద్ద భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం, వేడి తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఉదయం నుండి భక్తులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగస్థులు సైతం తమ కుటుంబ సమేతం తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయాన్నికి పెద్ద ఎత్తున తరలివసు_న్నారు. ఆలయ ఈఓ మోహ న్ రెడ్డి, ఆలయ చైర్మెన్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన ఆర్చకులు శివప్పలు శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి, అమ్మవారిని ప్రత్యే కంగా అలంకరించి, కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించగా భక్తులు ఒడి బియ్యం పోసి, ప్రత్యేక పూజలు నిర వ్రహిం చి, తమ మొక్కులను తీర్చుకొవడానికి పెద్ద సంఖ్యలో హాజరైనారు. భక్త లు శివసత్తుల విన్యాసాల నడుమ భక్తులు బోనాలను డప్పు చప్పులతో ఆలయం చుట్టు ఊరేగించి, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారికి బోనం నైవేద్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఓ బి. మోహన్ రెడ్డి తన సిబ్బంది సహకారంతో గర్భ గుడిలోకి భక్తులకు దర్శినం కల్పించారు. అటవీ ప్రాంతంలో ఆలహాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద ప్రతి ఆది వారం నాడు చిన్న చిన్న శుభ కారా ్యలను చేస్తుండటంతో భక్తులు రద్దీ మరింత పెరిగి పోతుం ది. ఆసలే వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండటం కారణంగా త్రాగు నీటికి ఏలాంటి ఆసౌర్యాలు కల్గకుండ భక్తులకు ఈఓ తన సిబ్బందితో నీటి సౌలభ్యతతో పాటు మౌళిక వసతులు కల్పించారు. ఈ కార ్యక్రమంలో ఆలయం జూనియర్ ఆసిస్టెంట్ వేంకట్ రెడ్డి, ఆలయ ప్రధాన ఆర్చకులు శివప్ప, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

## అమెరికాలో మీట్ విత్ పొన్నంకు అనూహ్య స్పందన

**హుస్నాబాద్, మే26, ప్రభాతవార్త** అమెరికాలో ఉంటున్న తెలంగాణ ప్రజల కష్ట సుఖాలు తెలుసుకునేందుకు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం మీట్ విత్ పొన్నం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. రాష్ట్రం నుండి అమెరికాకు వెళ్లి స్థిరపడిన వ్యక్తులతో పాటు ఎన్ఆర్ఐలు, వివిధ పనులు జేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తులు ఎంతో మంది మంత్రిని కలిసి వారి సమస్యలు, అక్కడ వారు పడుతున్న కష్ట సుఖాలను మంత్రితో పంచుకున్నారు. ఈ నేపధ్యంలో హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన బుర్ర రాజయ్య కుమారుడు గణేష్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం రాష్ట్ర పరిస్థితులపై మంత్రితో చర్చించారు.

## పుల్‌కల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పుల్‌కల్, మే 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. 2003-03 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో కలిసి చదువుకున్న విద్యార్థులు ఒక చోటకు చేరుకుని సమ్మేళనం జరుపుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసు కుంటూ నేటి జీవనాన్ని, పిల్లల భవిష్యత్తుపై కులసాగా చర్చించుకున్నారు. నాటి విద్యా బోధన చేసిన పూర్వ ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలు వాలు, పూలమాలలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

## నేడు కొత్తూర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత : ఏఈ

**కొత్తూర్, మే 26, ప్రభాతవార్త :** కొత్తూర్ పురపాలిక పరిధిలో నేడు ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ ఏఈ సాయికృష్ణ తెలిపారు. పురపాలిక పరిధిలోని ఎస్సీ కాలనీ, కుమ్మరిగూడ, స్టేషన్ తిమ్మాపూర్, ఫాతిమాపూర్ ప్రాంతాల్లో 11 కె.వి ఫీడర్ పరిధిలోని లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, లూజు లైన్లను సరి చేయడం వంటి పునరుద్దారణ పనులు చేపడుతున్న సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దయచేసి ప్రజలు సహకరించాలన్నారు.

## అన్నదానాన్ని మించినది ఏదీలేదు : ధరణిమాత



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, ప్రజలు

**శంషాబాద్,మే 26, ప్రభాతవార్త :** అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని శ్రీ ధర్మగిరి దేవాలయం ఫౌండర్ చైర్మన్ ధరణిమాత ట్రస్ట్ శివసాయి దత్తు పేర్కొన్నారు. శంషాబాద్‌లోని శ్రీధర్మసాయి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి ఆదివారం, గురువారం అన్నదాన కార్యక్రమాన్ని విజయంతంగా నిర్వహించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ భూమి మీద అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని ప్రతి ఒక్కరూ అన్నదాన కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని సూచించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు కడుపునిండా భోజనం పెట్టడం మహా అదృష్టంగా భావించాలని ఈ బృహత్ కార్యంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. అన్న ప్రసాదం స్వీకరించిన వారు నిండు మనసుతో దీవెనలు తీసుకోవాలని తెలిపారు.

## ఈశ్వరప్పకు సేవారత్న బిరుదుతో పాటు డాక్టరేట్ ప్రధానం



బెంగుళూరులో డాక్టరేట్ తీసుకున్న వెన్న ఈశ్వరప్ప

**కుల్కచర్ల; మే 26 ;ప్రభాతవార్త;** ప్రజలకు సేవలు అందించే గుణం ఉంటే అవార్డులు,రివార్డులు వాటంతట అవే దరి చేరతాయని నిరూపించారు గండీడ్ మండలానికి చెందిన వెన్నచేడ్ గ్రామానికి చెందిన వెన్న ఈశ్వరప్ప.ఆయన గత 20 సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో లయన్స్ క్లబ్ ద్వార గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు విశిష్టమైన సేవలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు.అందుకు బదులుగా సేవారత్న బిరుదుతో సత్కరింపబడ్డాడు.తారతమ్య బేదాలు లేకుండా నిస్వార్థంగా సేవలు కొనసాగిస్తుండడంతో బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో మదర్ తెరిసా యూనివర్సిటి నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.యూనివర్సిటి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ సరస్వతి మదర్ తెరిసా యూనివర్సిటి డీన్ మరియు సిఇఓ డాక్టర్ జాన్ ఎం స్ట్రోమ్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ పొందారు.వెన్న ఈశ్వరప్పకు డాక్టరేట్ రావడంతో కుల్కచర్ల మండలంలో హర్షాతిరేఖాలు వెల్లువెత్తాయి. సన్నిహితులు అభిమానులు ఆయనను పొగడ్తలతో ముంచెత్తారు.ప్రస్తుతం ఆయన బారతీయ జనతా పార్టి ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రదాన కార్యదర్శిగా కొనసాగుతు న్నారు.ఆయనకు కుల్కచర్ల మండలంలో భారి సంఖ్యలో అభిమానులు ఉన్నారు.కుల్కచర్లకు ఆయనకు విడదీయరాని భంధం.ప్రజలకు మరింత విస్తృతమైన సేవలకు గాను రాజకీయంగా ఆయనకు అవకాశం కల్పించాలని పలువురు అభిమానులు కోరుతున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సేవారత్నతో పాటు డాక్టరేట్ పొందడం సంతోషకరమని ప్రజలకు మరింత సేవలందించాలనే బాధ్యత పెరిగిందని అన్నారు.

## ఘనంగా పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**మాడ్గుల,మే26,ప్రభాతవార్త:** ఏంరా ఎలాగున్నావు..ఎన్నాళ్లయిందో మిమ్మల్సి చూసి,ఇంటో అందరూ బాగున్నారా అంటు ఒకప్పటి బాల్య స్నేహితులు రెండు దశాబ్దాల తరువాత కలుసుకున్నారు.తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.చాలారోజుల తరువాత కలుసుకున్నావారు బాలలుగా మారి ఆనందోత్సాహాలతో తమ అమ్యూలమైన సమయాన్ని కొద్ది గంటలపాటు గడిపారు.మాడ్గులమండలం లోని బ్రాహ్మణపల్లి పునీత గైతాను ఉన్నత పాఠశాల2001' -2002సంవత్సంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వపు విద్యార్థులు ఆదివారం పూర్వపు విద్యార్థులు సమేళనం నిర్వహించారు. ఈసందర్బంగా ఒకరినొకరు పరిచయాలు చేసుకున్నారు.అనంతరం పాఠశాలలో తమకు విద్యా నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూదిని జైచంద్రరెడ్డి, జ్యోతి,జగన్,బాలశౌరి,కురుణకర్,రామాచారి పూర్వపు విద్యార్థులు డాక్టర్ భూపాల్‌నాయక్,మేరావత్ రవినాయక్,గోపాల్ నాయక్, సూకుమార్‌రెడ్డి,మహమ్మద్ ఖాసి,చంద్రమౌళి, దినేష్‌రెడ్డి, ఆంజనేయులు, పావని,స్వప్న,శ్రీవాని,వసంత తదితరులు పాల్గొన్నారు.

## మోడీతోనే దేశం అభివృద్ధి : మన్నె ఆంజనేయులు

**రాయపోల్ మే26 ప్రభాతవార్త** ప్రధాని నరేంద్రమోడీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బిజెపి మండల నాయకులు మన్నె ఆంజనేయులు అన్నారు. ఈ సందర్బంగా ఆదివారం రాయపోల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ..ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నిక ల్లో ప్రధాని నరేంద్ర మోడీ ముచ్చటగా మూడవసారి కేంద్రంలో అధికారం లోకి రావడం ఖాయమని ఆయన అన్నారు.దేశం అభివృద్ధి చెందటాంటే ప్రధాని నరేంద్ర మోడీ సాధ్యమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకా లతో దేశ ప్రజలు మరోసారి ప్రధానిగా నరేంద్ర మోడీకే భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారని ఆయన అన్నారు.ఉగ్రవాదం, దేశ రక్షణ, అంతర్గత భద్ర తకు బిజెపి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు.మెదక్ ఎంపీగామాధ వనేని రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలువబోతున్నారని ఆయన అన్నారు.



శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో హనుమాన్ దీక్ష మాలదార భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన దృశ్యం

## హనుమాన్ దీక్ష మాలదారులకు అన్నదానం

**శామీర్‌పేట, మే 26, ప్రభాతవార్త** మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో హనుమాన్ దీక్ష మాలదార భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని ఆ ఆలయంలో భక్తులు పూజలు చేశారు. శ్రీహనుమాన్ దీక్ష మాలధారులకు మహేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆల యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. దీనిలో ఆలయ కమిటీ అధ్యక్షులు బాలకృష్ణ, విష్ణుచారి, రాములుచారి, శ్రీనివాస్‌చారి, యోగిచారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం, జాతర

**శామీర్‌పేట, మే 26, ప్రభాతవార్త** లక్ష్మాపూర్ గ్రామ సమీపంలోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం, జాతర మహోత్సవాలు ఆలయంలో ఈ నెల 27,28,29 తేదీలలో జరుగనున్నట్లు లక్ష్మాపూర్ గౌడ సంఘం వారు పేర్కొన్నారు. మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో 27న సోమవారం ఉదయం 10గంటలకు పుట్ట బంగారం తెచ్చుట, మధ్యాహ్నం 12గంటలకు లంధకు వెళ్లటం, సాయంత్రం గంగకు వెళ్లటం జరుగుతుందన్నారు. 28న మంగళవారం ఉదయం జాతరలో భాగంగ గణపతి నవగ్రహ పూజ,హోమం, ఉదయం 11గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం జరుగుతుందని, మధ్యాహ్నం 1గంటకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం 5గంటలకు బోనాలు, ఊరేగింపు, ఘటం తీసే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 29న బుధవారం ఉదయం 8గంటలకు వనభోజనం కార్యక్రమాలు ఉంటాయన్నారు. శ్రీరేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, జాతర మహోత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆ గ్రామ గౌడ సంఘం వారు కోరారు.

## తూంకుంటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శామీర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, మే 26, ప్రభాతవార్త** శామీర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-2005 పదవతరగతి బ్యాచ్ (పూర్వ) విద్యార్థుల సమ్మేళనం ఘనంగ జరిగింది. ఆదివారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని సమ్మర్‌గ్రీన్ రిసార్టులో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగ నాటి విద్యార్థులు జరుపుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఆదివారం సంతోషంగ గడిపారు. సుమారు 55మంది పూర్వ విద్యార్థులు దీనిలో పాల్గొన్నారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో వారు ఆటపాటలతో సందడిగా గడిపారు. తమ చిన్న నాటి స్నేహితులు కొన్ని సంవత్సరాల తరువాత ఒకే వేధికగ ఏర్పడి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నామన్నారు. అందరం చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగ గడపటానికి పూర్వ విద్యార్థుల సమ్మేళనం దోహదపడిందన్నారు. పూర్వ విద్యార్థుల పరిచయాలు చేసుకుంటూ వారి యోగ క్షేమాలను తెలుసుకుని ఆదివారం ఉత్సాహంగ సంతోషంగ అందరం గడపటం జరిగిందన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ములుగు, మే 26 (ప్రభాతవార్త):** ములుగు మండలకేంద్రంలోని 132/22 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని వంటిమామిడి, క్షీరసాగర్, తునికిబొల్లారం, కొక్కొండ, బండమైలారం గ్రామాలతో పాటు బండమైలారం సీడ్‌పార్క్ పరిధిలో పరిశ్రమలకు, బండతిమ్మాపూర్ పరిధిలోని పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

## ఘనంగా భవాని మాత వార్షికోత్సవం

**నారాయణఖేడ్; మే 26 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మండల పరిధిలోని గునుకుల కుంట గ్రామ పరిధిలో గల భవాని మాత వార్షికాకోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా నాయకులు పి.సుధాకర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాఘవరెడ్డి, సంగన్న, కృష్ణారెడ్డి గ్రామానికి చెందిన యువకులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్రలో హత్య

కల్హేర్, మే 26 ప్రభాతవార్త: కల్హేర్ మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన వెంకటేశం రెండు రోజుల కిందట కిడ్నాప్ అయ్యాడు. మహారాష్ట్రాలోని ఉద్గార్‌లో అక్కడి పోలీసులు వెంకటేశం మృతదేహాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన వెంకటేశం మృతదేహంగా గుర్తించారు. భార్య విజయతో పాటు గ్రామస్థులను పోలీసులు అక్కడికి తీసుకెళ్లారు. వెంకటేష్‌ను హత్య చేసింది బందువులుగా తెలియడంతో వారు జూక్కల్ పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు.

## ఎమ్మెల్యే పరామర్శ

కల్హేర్, మే 26 ప్రభాతవార్త: కల్హేర్ మండల పరిధిలోని మిర్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన నాగయ్య కుమారుడు శేఖర్ గత కొన్ని రోజుల క్రితం చనిపోయాడు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తన గ్రామానికి ఓటు హక్కు వినియోగించుకోవడానికి గ్రామానికి వచ్చాడు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసి తిరిగి హైదరాబాద్‌కు వెళుతుండగా సుల్తాన్‌పూర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విషయం తెలుసుకుని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యాన్ని ఇచ్చి మీకు ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చాడు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు రామ్‌సింగ్, ఎంపీటీసీ అంజయ్యసాగర్, తాజా మాజీ సర్పంచ్‌లు యాకూబ్, గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజు, నాయకులు కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.



నాగయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



ఆలయ నిర్మాణాలకు విరాళం అందజేస్తున్న నాయకులు

## ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత

**కొత్తూర్, మే 26, ప్రభాతవార్త :** ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని కొత్తూర్ పురపాలిక పట్టణ పెద్దలు అన్నారు. ఆదివారం కొత్తూర్ పురపాలికలో ఆలయ నిర్మాణాలకు కొత్తూర్ మున్సి పాలిటీకి చెందిన మోర క్రాంతిరెడ్డి రూ.9లక్షలు, ఇందూరి శ్రీనివాస్ రూ.2లక్షల 21వేలు, యువనా యకుడు శివచారి రూ.1లక్ష11వేలు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయాల నిర్మాణాలకు తమ వంతు విరాళం అందజేసే అవకాశం దొరికినందుకు అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో జె.సుదర్శన్‌గౌడ్, కె.సదానందంగౌడ్, బాతుక దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ మాదారం నరసింహగౌడ్, బ్యాగరి యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి,తుప్పర రమేష్, కరోళ్ల లక్ష్మయ్య, వీరమోని శ్రీనివాస్‌ముదిరాజ్, బండి కృష్ణ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

### యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి తాజా మాజీ వార్డు సభ్యుడు గంగిసెట్టి చెన్నయ్య



విజేత జట్టుకు షీల్డ్‌ను అందజేస్తున్న చెన్నయ్య తదితరులు

**నందిగామ, మే 26, ప్రభాతవార్త** క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దేహదారుఢ్యం పెరుగుతుందని యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని బిఆర్ఎస్ సీనియర్ నేత పిట్లగూడ తాజా మాజీ వార్డు సభ్యులు గంగిసెట్టి చెన్నయ్య అన్నారు. ఆదివారం నందిగామ మండలం పిట్లగూడ గ్రామంలో పిపిఎల్-8 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చెన్నయ్య మాట్లాడుతూ క్రీడలతో యువతతో స్నేహబంధాలు పెంపొందుతాయన్నా రు. యువతపైనే దేశ భవిష్యత్తు ఆదారపడి ఉందని తనకు పదవి ఉన్నా లేకున్నా యువకులకు ప్రతి సంవత్సరం క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ విజేత హైదరాబాద్ టీంకు రూ.11000 వేలు, రన్నర్ ముంబై టీంకు రూ.5000 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మొయినాబాద్, మే 26, ప్రభాతవార్త :** పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 2202-2003 ఎస్ఎస్సీ బ్యాంచ్ జడ్పిహెచ్ఎస్ ఉన్న పాఠశాల కనక మామిడి గ్రామంలో ఫ్రెండ్స్ గర్ల్స్ అండ్ బాయ్స్ కలిసి ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్ మండలం సిపిఐ మండల కార్యదర్శి కే శ్రీనివాస్ డాక్టర్ చంద్రశేఖర్ గుర్రాల మహేందర్ అశోక్ గౌడ్ పాష ఎం శ్రీనివాస్‌రెడ్డి బి మహేందర్ ఏ రవీందర్ పి భాస్కర్ రావు విక్రమ్ ఎం శేఖర్ సుదర్శన్‌రెడ్డి సత్యనారాయణ మహేందర్ రెడ్డి మరియు తదితరులు అందరూ కలిసి ఈ సెలబ్రేషన్ జరుపుకున్నారు.

## భక్తులతో కిక్కిరిసిన తునికి నల్ల పోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, మే 26, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో రెండవ అతి పెద్ద జాతరగా పేరు గాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం నాడు భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుండి ఆలయం వద్ద భక్తులతో సందడిగా మారింది. ఆది వారం సెలవు దినం, వేడి తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఉదయం నుండి భక్తులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగస్థులు సైతం తమ కుటుంబ సమేతం తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయాన్నికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మెన్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన అర్చకులు శివప్పలు శ్రీనల్ల పోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి, అమ్మవారిని ప్రత్యే కంగా అలంకరించి, కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించగా భక్తులు ఒడి బియ్యం పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ మొక్కులను తీర్చుకొవడానికి పెద్ద సంఖ్యలో హాజరైనారు. భక్తు లు శివసత్తుల విన్యాసాల నడుమ భక్తులు బోనాలను డప్పు చప్పులతో ఆలయం చుట్టు ఊరేగించి, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఓ బి. మోహన్ రెడ్డి తన సిబ్బంది సహకారంతో గర్భగుడిలోకి భక్తులకు దర్శినం కల్పించారు. అటవీ ప్రాంతంలో ఆలహాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద ప్రతి ఆదివారం నాడు చిన్న చిన్న శుభ కారా ్యలను చేస్తుండటంతో భక్తులు రద్దీ మరింత పెరిగి పోతుం ది. ఆసలే వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండటం కారణంగా త్రాగు నీటికి ఏలాంటి ఆసౌర్యాలు కల్గకుండ భక్తులకు ఈఓ తన సిబ్బందితో నీటి సౌల భ్యతతో పాటు మౌళిక వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయం జూనియర్ ఆసిస్టెంట్ వేంకట్ రెడ్డి, ఆలయ ప్రధాన ఆర్చకులు శివప్ప, పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

## అమెరికాలో మీట్‌విత్ పొన్నంకు అనూహ్య స్పందన

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** అమెరికాలో ఉంటున్న తెలంగాణ ప్రజల కష్ట సుఖాలు తెలుసుకునేందుకు రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం మీట్ విత్ పొన్నం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. రాష్ట్రం నుండి అమెరికాకు వెళ్లి స్థిరపడిన వ్యక్తులతో పాటు ఎన్ఆర్ఐలు, వివిధ పనులు జేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తులు ఎంతో మంది మంత్రిని కలిసి వారి సమస్యలు,అక్కడ వారు పడుతున్న కష్ట సుఖాలను మంత్రితో పంచుకున్నారు.ఈ నేపథ్యంలో హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన బుర్ర రాజయ్య కుమారుడు గణేష్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అనంతరం రాష్ట్ర పరిస్థితులపై మంత్రితో చర్చించారు.

## పుల్‌కల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పుల్‌కల్, మే 26, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. 2003-03 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో కలిసి చదువుకున్న విద్యార్థులు ఒక చోటకు చేరుకుని సమ్మేళనం జరుపుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ నేటి జీవనాన్ని, పిల్లల భవిష్యత్తుపై కులసాగా చర్చించుకున్నారు. నాటి విద్యా బోధన చేసిన పూర్వ ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలువాలు, పూలమాలలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

**కేశంపేట,మే 26,(ప్రభాతవార్త):** కేశంపేట మండల కేంద్రానికి చెందిన తిమ్మగళ్ల దేవమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి విషయాన్ని కేశంపేట జడ్పిటిసి విశాల శ్రవణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ఆమె ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులకు శ్రీధర్‌రెడ్డి ద్వారా 5000 వే రూపాయలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన జడ్పిటిసి విశాల శ్రవణ్‌రెడ్డికి మరియు శ్రీధర్ రెడ్డిలకు దేవమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు రాజు రామచంద్రి రాజు ఆంజనేయులు శ్రీధర్ శ్రీకాంత్ చెన్నయ్య సాయి కుమార్ అనిల్ గణేష్ బన్నీ వెంకటయ్య నాని శేఖర్ శివ యాదయ్య మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు పొదుపును అలవర్చుకోవాలి

**షాబాద్, మే 26, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు పొదుపును అలవర్చుకోవాలని శ్రీవివేకానంద పరస్పర సహకార పొదుపు సంఘం అధ్యక్షుడు నర్సింలు అన్నారు. ఆదివారం షాబాద్ ఎంఎస్ గార్డెన్‌లో ఆయన అధ్యక్షతన 19వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....సంఘం గడిచిన 19సంవత్సరాల్లో దినదినాభివృద్ధి చెందుతూ, 802 మంది సభ్యులతో రెండున్నర కోట్ల టర్నోవర్ సాధించిందన్నారు. ఈకార్యక్రమంలో శ్రీరామాంజనేయ మండల సమాఖ్య ముఖ్యసలహాదారు బాల్‌రాజ్, పాలకమండలి సభ్యులు మల్లికార్జున్, ప్రదీప్, రజినీకాంత్, హరీష్, చంద్రయ్య, సత్యం, గౌరీశ్వర్, భాగ్యవతి, మల్లేష్, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎంపిపి పాండుగౌడ్

**మర్కుక్, మే 26 (ప్రభాతవార్త):** మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన నీల రమేష్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎంపిపి పాండుగౌడ్, మధుసూదన్‌రెడ్డిలు ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. వారితో పాటు కరుణాకర్, సుధాకర్, మ్యాకల శ్రీనివాస్, సిలివేరి శ్రీకాంత్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## శ్రీ విద్యాధరి క్షేత్రంలో మూల నక్షత్ర విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన విద్యాసరస్వతి అమ్మవారు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

**వర్గల్, మే 26 (ప్రభాతవార్త):** మూల నక్షత్రం మహోత్సవం సందర్భంగా ఆదివారం వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో అమ్మవారికి విశేష పూజలు, లక్ష పుష్పార్చన, చండీ హోమము, పారాయణము, విశేష అలంకరణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో మూల మహోత్సవ కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. మూల మహోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి విశేష సంఖ్యలో భక్తులు హాజరుకాగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు. ఇదిలా ఉండగా మూల నక్షత్ర పర్వదినం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్న పూర్వ విద్యార్థులు

**గజ్వేల్, మే 26 (ప్రభాతవార్త):** ప్రజ్ఞాపూర్‌లోని ప్రభుత్వపాఠశాలలో 1996-97 విద్యాసంవత్సరంలో 10వ తరగతి విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం గౌరారంలోని హిల్స్ సెవెన్ రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గత జ్ఞాపకాలను నెమరేసుకోవడంతో పాటు ప్రస్తుతం వారి జీవన స్థితిగతులను ఒకరికొకరు పంచుకున్నారు. అనంతరం వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయు లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే పూర్వ విద్యార్థులు కోలాటం, వివిధ కార్యక్రమాలను నిర్వహించుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండల్‌రెడ్డి, రామచంద్రరావు, ధర్మపురి లక్ష్మణ్, స్వామి, శంకర్, రామ్‌రెడ్డి, కేశవరెడ్డి, కాశీనాథ్, జైపాల్‌రెడ్డి, మామిడి లక్ష్మినర్సయ్యగౌడ్, రఘుపతితో పాటు పూర్వ విద్యార్థులు రమాదేవి, దేవకల, శ్రీదేవి, సంతోషి, భారతి, సంతోషి, సుప్రియ, శోభ, రాచకొండ రమేష్, చిత్ర ఆర్ట్స్ నర్సింలు, మహిపాల్‌రెడ్డి, గోపిశెట్టి అశోక్‌కుమార్, వెంకటేష్‌చారి, ప్రొద్దుటూరి భాస్కర్, బాలకిషన్, నర్సింలు, మల్లేశం, శ్రీనివాస్, నవీన్, పోచాగౌడ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**చిన్నశంకరంపేట,మే26,ప్రభాతవార్త:** మండల పరిధి కోర్విపల్లి మాజీ ఉపసరపంచ్ సక్రునాయక్ అనారోగ్య సమస్యతో భాదపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి భాదిత కుటంబా న్ని పరామర్శించారు. అంతకుముందు రుద్రారం మాజీ సర్పంచ్ లక్ష్మణ్ తల్లి రాజమ్మ ప్రథమ వర్ధందిలో పాల్గొని నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష్యుడు రాజు, మాజీ సర్పంచ్‌లు యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

# 'గాంధీ'లో డబ్బుల గోల

**కొందరి వ్యవహారంతో ఆస్పత్రికి అప్రతిష్ట**

**వైద్యుడిపై ఆరోపణలు**

**విచారణకు కమిటీ నియామకం**

**సికింద్రాబాద్, మే 26 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా వైద్య సేవలు అందించే సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి నానాటికి రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి రోగులు గాంధీ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. ఇన్ పేషెంట్‌లుగా దాదాపు రెండు వేల మంది చికిత్సలు పొందుతుండగా ఔట్‌పేషెంట్‌లుగా ప్రతిరోజు 15 వందల నుంచి రెండువేల వరకు వస్తున్నారు. ప్రతి రోగికి గాంధీ ఆస్పత్రిలో వైద్యం అందించి ఆరోగ్యవంతులనుచేసి డిశ్చార్జిచేసి పంపుతుంటారు. కొన్ని రోజులుగా ఉస్మానియా ఆస్పత్రి కంటే గాంధీ ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితిలో కొన్ని సంఘటనలు గాంధీ ఆస్పత్రి ప్రతిష్టను తగ్గిస్తున్నాయి.కొందరు సిబ్బంది, వైద్యుల కారణంగా గాంధీ ఆస్పత్రివైద్యులకు అప్రతిష్టపాలు చేస్తోంది. ఇలాంటి సంఘటనల వల్ల వైద్యులు అనవసర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**రోగి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన వైద్యుడు...**

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఎలాంటి వైద్యమైనా ఉచితంగానే చేస్తారు. ప్రతి పేద ఇక్కడ వైద్యం చేసుకొని వెళుతుంటారు.కాగా ఓ పేషెంట్‌కు సర్జరీ చేసేందుకు వైద్యుడు డబ్బులు డిమాండ్ చేశారని విమర్శలు వచ్చాయి. గతంలో చిన్నచిన్న ఆరోపణలు వచ్చాయి. తాజాగా ఖమ్మం జిల్లా మధిరకు చెందిన వెంకట్‌రెడ్డి తీవ్ర అనారోగ్యంతో గాంధీ ఆస్పత్రిలో చేరారు. అతనికి సర్జరీ చేసేందుకు ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన డాక్టర్ రూ. 10 వేలు డిమాండ్ చేశారని, తప్పనిసరి పరిస్థితిలో రోగి గూగుల్ పే ద్వారా చెల్లించినట్లు రోగి భార్య సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు సంఘటనపై విచారణ జరిపేందుకు నలుగురు హెచ్ఓడీలతో స్పెషల్ కమిటీని నియమించారు. నిజానిజాలు నిగ్గుతేలిన తరువాత సర్జరీ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసి వసూలు చేసిన వైద్యుడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది.

గతంలోనూ గాంధీ ఆస్పత్రి పాలనా విభాగంలో విధులు నిర్వహించే ఓ వ్యక్తిపై పలు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో జరిగిన సంఘటనలు గాంధీ ఆస్పత్రి పరువును బజారున పెట్టాయి. పాలనా విభాగంలో ఒకవ్యక్తి ప్రతీ పనిలో ఆయన హవా నడవాల్సిందేనని మొండిగా వ్యవహరించేవాడని ఆరోపణలు వినిపించాయి.పలు వ్యవహారాలకు సంబంధించిన కాంట్రాక్టర్‌లు ఆయన చెప్పిన పనులు చేయడంతో పాటు చెప్పుచేతల్లోనే కొనసాగాలని మొండిగా వ్యవహరించాడు. ఆయన మాట వినని ముగ్గురు కాంట్రాక్టులను తప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో కాంట్రాక్టర్ వద్ద దాదాపు వంద మందికి పైగా పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, ఆయాలు, నర్సులు, పేషెంట్ కేర్ వార్డుబాయ్‌లు ఉంటారు. ఇందులో కొందరిని తొలగించడంతో అప్పట్లో కార్మికులు ఆందోళన కూడా చేపట్టారు. ఇలాంటి సంఘటనలు గాంధీ ఆస్పత్రి ప్రతిష్టను దిగజారుస్తున్నాయి. ఎంతో అద్భుతమైన వైద్య సేవలు అందిస్తున్న గాంధీ ఆస్పత్రిలో కొందరి వ్యవహారం వల్ల వైద్య బృందంపైనే నమ్మకాలు పోయే పరిస్థితి నెలకొంటుంది.

ఉన్నతాధికారులను ఒప్పించి వైద్య పరికాలు, ఇతర అభివృద్ధి పనుల్లో ఎంతో అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు గాంధీ ఆస్పత్రి శవమై ఇంటికి చేరుతారనే ఆరోపణల నుంచి ఎలాంటి కఠినమైన రోగాలనైనా తగ్గించి గాంధీ ఆస్పత్రి ఇంటికి పంపుతుందన్న నమ్మకాన్ని పెంచుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో కొందరి వ్యవహార తీరు ఆస్పత్రి ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి.




## హక్కుల సాధనకు బిసిలు మరో ఉద్యమం చేయాల్సిందే

**రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు**

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** బీసీలందరూ ఏకమై చైతన్యవంతంగా ముందుకు వెళ్లి హక్కుల కోసం, రాజ్యాధికారం కోసం మరో ఉద్యమం చేయవలసిందేనని రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ టి. చిరంజీవులు అన్నారు. సోమాజీగుడా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిధిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం అనుభవించేందుకు అవకాశం ఉందన్నారు. అగ్రవర్ణాల ఆధిపత్య పోరు కారణంగా రోజు రోజుకూ చట్ట సభల్లో తగ్గుతోందే తప్ప పెరగటం లేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేసి బీసీల రిజర్వేషన్ల సంఖ్య పెంచి గనుక ఎన్నికలకు వెళ్తే తప్ప బీసీలకు సరైన న్యాయం జరగదని అభిప్రాయపడ్డారు. బీసీలందరూ ఏకమై రాజ్యాధికార దిశగా అడుగులు వేయకుంటే తామందరి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బీసీ నవసమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ ప్రతి నెలలోనూ చివరి ఆదివారం బీసీ కుల సమ్మేళన కార్యక్రమం జరుగుతుందని స్పష్టం చేశారు. రేపు జరగనున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కుల గణన జరిపిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని, లేని పక్షంలో అన్ని కుల సంఘాల నాయకులతోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘ నాయకులతో పాటు బీసీ సమాజ్ యువజన విభాగం అధ్యక్షులు పెద్ద బుద్ధుల సతీష్ సాగర్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, మహిళా నాయకురాలు శ్రీమతి పాతకోటి ఉమ తదితరులు పాల్గొని బీసీల తరఫున మద్దతు తెలియజేశారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

### మల్లాపూర్‌లో పిడుగు పాటుకు పిట్టగోడ ధ్వంసం

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ సమీపంలోనున్న మల్లాపూర్‌లో పిడుగు పడింది. గ్రామంలోని బొడ్రాయి వద్దనున్న ఓ ఇంటి పెంట్ హౌస్ పిట్టగోడపై పిడుగు పడడంతో కొంతమేరకు ధ్వంసమైంది. ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీస్తున్న వేళ ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అయితే పిడుగు పడిందని ఆ తర్వాత తెలుసుకున్నారు. పిడుగు పాటు పిట్టగోడ ధ్వంసం తప్ప ప్రాణ, ఆస్తి నష్టం గానీ జరగలేదు.

### విద్యుదాఘాతంతో బాలుడి మృతి

**బేగంపేట మే 26,ప్రభాతవార్త :** విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందిన సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం ప్రకారం... సికింద్రాబాద్ అడ్డగుట్ట తుకారాంగేట్ చంద్రశేఖర్‌నగర్ కు చెందిన భార్యాభర్తలు జీ.సుధాకర్ సునీతలు ఉపాధి కోసం కార్మికులుగా పనిచేస్తున్నారు.వీరికి పూజిత(19),శివకుమార్(16) అనే ఇద్దరు సంతానం ఉన్నారు.భార్యాభర్తలు ఇద్దరూ స్వగ్రామానికి వెళ్లడంతో ఇంట్లో శివకుమార్ ఉన్నాడు.వారికి దగ్గరి బంధువు శివరాత్రి శ్రీను శనివారం రాత్రి అమీర్‌పేట మైత్రీవనం వద్ద హెచ్‌ఎండీఏ వద్ద పనుల కోసం తీసుకుని వచ్చాడు.రాత్రి గం 11.30నిల ప్రాంతంలో మైత్రీవనం ఆవరణలో మొక్కలు నాటడం కోసం ట్రాక్టర్‌తో డిగ్గింగ్ పనులు చేస్తుండగా భూమిలో ఉన్న విద్యుత్ కేబుల్ తగలడంతో విద్యుదాఘాతం జరిగి శివకుమార్ కుప్పకూలిపోయాడు.వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ విషయం తెల్సుకున్న అతని తల్లి దండ్రులు ,బంధువులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కుమారుడి మృతి పట్ల ఆందోళణకు దిగారు.మృతుడి తల్లి సునీత ఫిర్యాదు మేరకు సంఘటనలో బాలుడిని పనిలోకి తీసుకు వచ్చిన బంధువు శివరాత్రి శ్రీను తో పాటు కాంట్రాక్టర్ మహబూబ్ పాషా,సూపర్ వైజర్ ఖదీర్ పాషాలపై పలు సెక్షన్లతో పాటు బాలకార్మిక చట్టం కింద కేసు నమోదు చేసారు.


ప్రదీప్‌ను సత్కరించిన దృశ్యం

### తెలుగువారి ఆస్తి అన్నమాచార్యులు

**-ప్రముఖ సినీనటుడు ప్రదీప్**

**చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త:** తెలుగువారి ఆస్తి అన్నమాచార్యులు అని ప్రముఖ సినీనటులు కె.వి.ప్రదీప్ అన్నారు. శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల వారి 616వ జయంతిని పురస్కరించుకుని ఆలిండియా రేడియో, దూరదర్శన్ కళాకారులు గౌరీభట్ల లక్ష్మణమూర్తి నేతృత్వంలో 100మందికిపైగా గాయనీ గాయకులు అన్నమయ్యకీర్తనలను అద్భుతంగా గానం చేశారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ డాక్టర్ సరస్వతి ప్రదీప్, ప్రముఖనర్తకి ఆశ్రిత వేముగంటి నందూరి, సంగీత దర్శకులు డాక్టర్ జోశ్యభట్ల, అకాడమి డైరెక్టర్ వసుధామూర్తి, ఈవెంట్ మేనేజర్స్ నందిని, యామిని పాల్గొన్నారు. పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 32వేల సంకీర్తనలను రచించి వేంకటేశ్వరస్వామికి అర్పించారన్నారు. భగవంతుడికి దగ్గర అవడంవల్లే వేల కీర్తనలను రచించడం సాధ్యమైందన్నారు. అన్నమయ్య కీర్తనలపై నృత్యరూపకల్పన చేసి ప్రదర్శించిన శాలిని, హర్షిణి(టీం అహర్షిత) ప్రతిభను కొనియాడారు. సాంప్రదాయం పరిఢవిల్లాలంటే అన్నమాచార్యుల వారి కీర్తనలు ఎంతో అవసరమని, అది ఆచరణలో పెట్టినందుకు అకాడమి డైరెక్టర్ వసుధామూర్తి అభినందనీయురాలని వక్తలు పేర్కొన్నారు. ఇదే సభలో హరీష్ భాగవతుల స్క్రిబల్ ఆర్ట్‌తో వేసిన అన్నమయ్య చిత్రాన్ని ఆవిష్కరించారు.

## సందర్శకులతో కిక్కిరిసిన పాతబస్తీలోని పర్యాటక కేంద్రాలు

**చార్మినార్, మే 26 ప్రభాతవార్త :** విద్యా సంస్థలకు వేసవి సెలవులు కావటంతో పాతబస్తీలోని పర్యాటక రంగ స్థలాలు సందర్శకులతో కిక్కిరిసి పోతున్నాయి. చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియం, హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులు కొద్ది రోజుల నుంచి పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. ఎండలు మండుతున్నప్పటికి సందర్శకులు ఎంతో ఉత్సాహంతో పర్యాటకరంగ స్థలాలను తిలకించడానికి తరలి వస్తున్నారు. దీంతో చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, జూపార్కు ప్రాంతాలు రద్దీగా ఉంటున్నాయి. గత ఆదివారం 26, 500 మంది సందర్శకులు నెహ్రూ జూలాజికల్ పార్కును తిలకించారు.కాగా 26వ తేదీ ఆదివారం వేలాది మంది పర్యాటకుల జూపార్కును చూడటానికి తరలి రావటంతో జూపార్కు పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జూపార్కు పర్యాటకులతో రద్దీగా కనిపించింది. ఆదివారం 30,361 మంది సందర్శకులు జూపార్కును తిలకించటానికి వచ్చారని జూపార్కు అధికారులు వెల్లడించారు. జూపార్కులోని జంతువులను సందర్శకులు ఎంతో ఆసక్తితో తిలకించారు.పాతబస్తీ నయాపూల్ వద్ద ఉన్న సాలార్‌జంగ్ మ్యూజియంను జంట నగరాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకుల సందర్శిస్తున్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉన్న అద్భుతమైన కళాఖండాలను తలికించిన సందర్శకులు ఎంతో అనుభూతికి లోనవుతున్నారు. చారిత్రక చార్మినార్ కట్టడాన్ని ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన సందర్శకులు చాడటానికి వచ్చారు. చార్మినార్ మొదటి అంతస్థు నుంచి పర్యాటకులు ఎంతో అద్భుతమైన చార్మినార్ కట్టడాన్ని మక్కువతో తిలకిస్తున్నారు. అదేవిధంగా చార్మినార్‌కు దగ్గరలోఉన్న చౌమహల్లా ప్యాలెస్,పురానీహవేలీలోని నిజాం మ్యూజియంలు సైతం పర్యాటకులతో కళకళ లాడుతున్నాయి.


జూ పార్కులో సందర్శకులు సందడి

## గురుకులాల్లో బదలీలు చేపట్టాలి

**ఎల్‌బినగర్, మే 26 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్‌లోని టిగారియా సంఘం కార్యాలయంలో ఆదివారం గురుకుల జెఎసి సమావేశం నిర్వహించారు. సమావేశానికి సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ, జనరల్ గురుకులాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. గురుకులాలన్నింటికి కామన్ అడ్మినిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా గురుకుల డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని, ప్రజాభవన్‌లో గురుకుల ఉపాధ్యాయులు ఫిబ్రవరిలో ఆందోళన చేసిన సమయంలో జెఏసికి ఇచ్చిన హామీ మేరకు పాఠశాలలు పున:ప్రారంభం కావడానికి ముందే జిఓ 317 బదిలీలు పూర్తి చేసి ప్రమోషన్స్ ఇవ్వాలని, సాధారణ బదిలీలు పూర్తి చేసిన తర్వాతే నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్స్ ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల డైట్ ఛార్జీలను పాఠశాలలు ప్రారంభించడానికి ముందే పెంచాలని, గురుకుల ఉపాధ్యాయులకు నైట్ స్టేను తొలగించాలని, రాబోయే పిఆర్‌సిలో గురుకుల ఉపాధ్యాయులకు ప్రత్యేక వేతన స్కేలు, స్పెషల్ టీచర్స్‌కు టిజిటికి సమానమైన స్కేలు వర్తింప చేయాలని, అన్ని గురుకులాల్లో వార్డెన్ పోస్టులు భర్తీ చేసి ఉపాధ్యాయులను డిప్యూటీ వార్డెన్ బాధ్యతల నుంచి విముక్తి చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల టైమింగ్స్‌ను గురుకుల డిగ్రీ కళాశాలలకు వర్తింప చేయాలని, అన్ని గురుకులాలకు ఒకే రకమైన స్టాఫ్ ప్యాటర్న్ ఉండేలా ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయాలని, బిసి గురుకుల పాఠశాలల టైమ్‌ను 9 గంటలకు మార్చాలని సమావేశంలో తీర్మానం చేశారు. గురుకులాల సంఖ్యను పెంచినప్పటికీ సరైన సదుపాయాలు కల్పించక పోవడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.మధుసూధన్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.రామకృష్ణయ్య, సంక్షేమ గురుకుల ప్రతినిధులు నర్సింహులు గౌడ్, కె.జనార్ధన్, బి.బిక్షం, గిరిజన గురుకుల ప్రతినిధులు పిఎస్ కమలాకర్, తెలంగాణ గురుకుల ప్రతినిధులు డాక్టర్ అజయ్ కుమార్, పిడిపిటి అసోసియేషన్ ప్రతినిధి ఆర్.లాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ అసోసియేషన్ ప్రతినిధులు ఎ.వేదాంతచారి, బి.కౌముది, జి.రజని, ఎస్‌సి గురుకుల ప్రిన్సిపాల్ సంఘం ప్రతినిధులు ఎస్.దానం, ఎస్.దయాకర్, మైనార్టీ గురుకుల సొసైటీ ప్రతినిధి ఎం.కృష్ణ పాల్గొన్నారు.

# సీటు.. మహా రేటు !

- ఇంజనీరింగ్ కాలేజీల అడ్డగోలు దందా
- ఒక్కో సీటుకు రూ.12-25 లక్షలపైనే
- కన్వీనర్ కోటా వర్తించని విద్యార్థులకు గాలం
- ప్రైవేటు కన్సల్టెన్సీల ఫోన్ల తాకిడి
- టాప్ టెన్ సీట్ల హామీ.. సీట్ల రిజర్వేషన్
- కౌన్సిలంగ్‌కంటేముందే బాహాటంగా వసూలు



**హైదరాబాద్, 26 ప్రభాతవార్త** కౌన్సిలింగ్ కంటే ముందే ఇంజనీరింగ్ కాలేజీల సీట్ల దందా జోరందుకుంది. ప్రైవేటు ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీల మధ్యవర్తిత్వంతో సీట్ల రిజర్వేషన్ ప్రక్రియకు తెరలేచింది. కన్వీనర్ కోటా కటాఫ్ కంటే అధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీట్ల టెన్షన్ పట్టుకుంది. ఇదే అంశం ఇంజనీరింగ్ కాలేజీలకు కాసులు కురిపిస్తోంది.కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకముందే పేరొందిన ప్రైవేట్ ఇంజీనిరంగ్ కాలేజీలు నిబంధనలు గాలికొదిలి సీట్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టాయి. దీంతో కన్వీనర్ కోటా వర్తించని విద్యార్థుల తల్లిదండ్రులకు కన్సల్టెన్సీల ఫోన్లతాకిడి అధికమైంది. టాప్‌టెన్..టాప్‌ట్వంటీ అంటూ కాలేజీల్లో సీట్లు ఇప్పిస్తామని గాలం వేస్తున్నాయి. ఏకంగా కాలేజీలకు తీసుకెళ్లి సీట్లు రిజర్వ్ చేయించడం బహిరంగ రహస్యంగా తయారైంది. కోర్సుల ఆధారంగా సగటున ఒక్కో సీటుకు రూ. 12 లక్షలు, 25లక్షల వరకు పలుకుతోంది. కొన్ని కాలేజీలు డొనేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు సైతం దిగాయి. సీటు రిజర్వేషన్ చేసుకొని మరో 20 రోజుల్లో మొదటి సంవత్సరం ఫీజు చెల్లిస్తే సీటు ఇస్తామని స్పష్టం చేస్తుండగా, ఇంకొన్ని కాలేజీలు మాత్రం మొత్తం ఒకేసారి నగదు రూపంలో చెల్లిస్తేనే సీటు, విడతలవారీగా చెల్లిస్తే ఆ డొనేషన్ పెరుగుతుందని తేల్చి చెబుతున్నాయి. అందులో సైతం కేవలం నగదు రూపంలోనే చెల్లించాలని, ఆన్‌లైన్ చెల్లింపులను నిరాకరిస్తున్నాయి. సీటు అంశం మాట్లాడేటప్పుడు మాత్రం యాజమాన్యాలు జాగ్రత్తపడుతున్నాయి. సదరు పేరెంట్స్ మొబైల్ ఫోన్లను సెక్యూరిటీలో పెట్టి లోపలికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాయి. బేరసారాలు ముగియగానే తక్షణమే రూ. 50 వేలు చెల్లించి రిజర్వేషన్ చేసుకునే విధంగా ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

**మూడు విడతలుగా కౌన్సిలంగ్...**

ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం జూన్ 30 నుంచి ఆగస్టు 5 వరకు మూడు విడతల్లో కౌన్సిలంగ్ జరగనున్నది. తొలి విడత కౌన్సిలింగ్ జూన్ 30-జులై 12 వరకు, రెండో విడత జులై 19-జులై 24వరకు, తుదివిడత కౌన్సిలింగ్ జులై 30 నుంచి ఆగస్టు 5 వరకు కొనసాగుతుంది. మూడు విడతల అనంతరం ప్రైవేట్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలను విడుదలవుతాయి.

**గతంలోనూ..**

ఇంజనీరింగ్ కాలేజీల్లో మెరిట్‌కు పాతర వేస్తుండగా.. సీట్లు అంగడి సరుకుగా మారాయి. వేలం మాదిరి రోజు రోజుకూ డిమాండ్ పెంచి మరీ డొనేషన్ల వసూలు చేస్తున్నాయి. బ్రాంచీలను బట్టి సొమ్ము చేసుకుంటున్నాయి. గతంలో సైతం మెరిట్ కాదు కదా.. అసలు జేఈఈ, ర్యాంకు, ఎంసెట్ రాయనివారికి కూడా సీట్లు లభించాయి. ప్రస్తుతం సైతం అదే పునరావృతం కాబోతోంది. టాప్ కాలేజీల్లోనే ఈ అడ్డగోలు దందా ఉండగా మిగతా కాలేజీల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

**పెరిగిన డిమాండ్...**

ప్రైవేట్ ఇంజీనిరంగ్ కాలేజీలు మెకానికల్, సివిల్ విభాగాల్లో సీట్లు తగ్గించుకుని, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ కోర్సుల సీట్లు పెంచుకున్నాయి. ఆ సీట్లకున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. తమ పిల్లలతో ఎలాగైనా కంప్యూటర్ సైన్స్ సంబంధిత కోర్సు చేయించాలని తల్లిదండ్రుల ఆశలు కాలేజీలకు కాసుల పంట పండిస్తోంది.

**ముందుగానే 'బి' కేటరిగి సీట్లు...**

జేఎన్టీయూ పరిధిలోనే 149 కాలేజీలుండగా ప్రైవేట్ కాలేజీల్లో 70శాతం సీట్లు కన్వీనర్ కోటా ('ఎ' కేటగిరి) ద్వారా.. మిగిలిన 30శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటా ('బి' కేటగిరి)లో ద్వారా భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది.కన్వీనర్ కోటా పూర్తయిన తర్వాత మేనేజ్‌మెంట్ కోటాను భర్తీ చేయాలి.. కానీ కన్వీనర్ కోటా ప్రక్రియ కంటే ముందే.. మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అమ్మకాలపై యాజమాన్యాలు దృష్టి సారించాయి. మేనేజ్‌మెంట్ల సీట్ల భర్తీలో 15శాతంసీట్లను ఎన్నారై/ఎన్నారై స్పాన్సర్డ్ కోటాలో కేటాయించాలి. మరో 15శాతం సీట్ల భర్తీలో జేఈఈ మెయిన్ ర్యాంకర్లకు మొదటి ప్రాధాన్యం. ఎంసెట్ ర్యాంకర్లకు రెండో ప్రాధాన్యం ఇవ్వాలి. ఎవరూ లేకుంటే ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా సీట్లను కేటాయించాలి. కానీ ఇవేవీ అమలులేకుండా ఇష్టానుసారం ప్రవేశాలకు తెరలేచింది.

## అసంపూర్తి ఎస్‌ఎన్‌డిపి పనులను పూర్తి చేయిస్తా: ఎమ్మెల్యే సబితారెడ్డి

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:** జల్‌పల్లి మున్సిపాలిటీలో అసంపూర్తిగా ఉన్న ఎస్‌ఎన్‌డిపి పనులను పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటానని స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని నబీల్ కాలనీలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టి ప్రారంభించిన ఎస్‌ఎన్‌డిపి పనులు కాంట్రాక్టర్ల వల్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని స్థానికులు దృష్టికి తేవడంతో స్పందించిన సబితారెడ్డి ఆదివారం స్థానికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె అసంపూర్తి నాలా పనులను, ఆ కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వరద ముంపు సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులను తీర్చడానికి ఎస్‌ఎన్‌డిపి నాలాల నిర్మాణపు పనులు చేపట్టామనీ అయితే ఈ పనులు పూర్తి చేయకుండా అర్ధాంతరంగా నిలిపివేయడం వల్ల ఇబ్బందులు వస్తాయని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ఉండే విధంగా చూడాలని ఆమె సూచించారు. అదే విధంగా రెండవ విడత కింద ఎస్‌ఎన్‌డిపి నాలా పనులను త్వరలో ప్రారంభిస్తామని సబితారెడ్డి వెల్లడించారు. కాగా నబీల్ కాలనీలో పర్యటించిన ఆమె కాలనీ వాసుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్లా సాది, కౌన్సిలర్ అహ్మద్ కసాది, ఖైసర్ బామ్, హుస్సేన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.


సమస్యలు పరిశీలిస్తూ మురికి కాలువ దాటుతున్న సబితా ఇంద్రారెడ్డి

## నగరంలో ఈదురు గాలులతో కూడిన వర్షం

**మరో మూడురోజులపాటు వర్షాలు**

**హైదరాబాద్, మే 26 ప్రభాతవార్త** నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆదివారం పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెమాల్ తుపాను, ఉపరితల ఆవర్తనంతో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వాన పడింది. హయత్‌నగర్ ప్రాంతంలో రేకులు, గుడిసెలు ఎగిరిపోయాయి. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వనస్థలిపురం, ఎల్బీనగర్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్, నాగోల్, కొత్తపేట, కర్మన్ ఘాట్, చంపాపేట్,మలక్‌పేట, తార్నాక, ఓయూ, మల్కాజ్‌గిరి, ఉప్పల్, అంబర్‌పేట, బంజారా హిల్స్‌లో వర్షం పడింది. వనస్థలిపురంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. గణేష్ దేవాలయం ప్రాంగణంలోని భారీ మర్రి చెట్టు రోడ్డుపై పడటంతో పలుకార్లు ధ్వంసం అయ్యాయి. భారీ ఈదురు గాలులకు పలు కాలనీలు, పార్కుల్లో చెట్లు విరిగి పడ్డాయి.ఎన్జీవోస్ కాలనీ ప్రధాన రహదారిపై, రైతుబజార్ సమీపంలో పార్కు వద్ద భారీ చెట్లు నేలకొరిగాయి.

జిహెచ్ఎంసి సిబ్బంది చేరుకుని రహదారిపై పడిన చెట్లను తొలగించారు. భారీ ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయ మేర్పడింది. కాగా, వచ్చే మూడు రోజులు వర్షాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ ఎంసి అధికారులు కూడా సూచనలు జారీ చేశారు.


హయత్‌నగర్‌లోని ఓ దుకాణంలోకి వర్షపు నీరు వచ్చిన దృశ్యం


హయత్‌నగర్‌లోని బొమ్మలగుడి రోడ్డు ప్రాంతంలో నేలకూలిన చెట్టు, పక్కన దుకాణంపై చెట్టుకూలిన దృశ్యం